ప్రజాశక్తి
ఆదివారం 5 నవంబరు 2023
5
శ్రీకాకుళం

రేపు కార్మిక, కర్షక సంఘీభావ దినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్త కార్మిక కర్షక సంఘీభావ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మోడీకో హటావో- దేశ్ కో బచావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్, జిల్లా కమిటీ సభ్యులు, అన్ని యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

ధాన్యం కొన్న 5 రోజుల్లోనే నగదు జమ

పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతు సంతప్తే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఉండాలని, వారు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని, సివిల్ సప్లయిస్ కమిషర్ హనుమంతు అరుణ్‌కుమార్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ఐదు రోజుల్లో నేరుగా రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టరేట్‌లో శనివారం సమీక్షించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ జిల్లాలోని పరిస్థితిని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 8,17,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. వాటిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారు 7,87,447 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించుకునేందుకు వీలుంటుందని అన్నారు. దాదాపు 5,40,,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 626 రైతు భరోసా కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని 390 క్లష్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 15 నాటికి ధాన్యం కొనుగోలుకు అవసరమైన కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా ప్రవేశించే బియ్యం రవాణా అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అరుణ్‌కుమార్ ధాన్యం కనీస మద్దతు ధర దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుకే చేరేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను వెల్లడించారు.

ఆర్‌బికెల నుంచి మిల్లు వరకూ జిపిఎస్ ట్రాకింగ్, ధాన్యం మిల్లుల్లో విద్యుత్ వినియోగం లాంటి అంశాలను పరిగణన లోకి తీసుకుంటామన్నారు. బయోమెట్రిక్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. సమావేశంలో డిఎస్‌ఒ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్, సివిల్ సప్లయి డిఎం శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ తరపున లాడి రమేష్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న అరుణ్‌కుమార్, నవీన్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

15న విజయవాడలో

ప్రజా రక్షణ భేరి సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజారక్షణ భేరి బస్ యాత్ర ముగింపు అనంతరం ఈ నెల 15న విజయవాడలో బహిరంగసభ నిర్వహిస్తున్నామని, చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరానగర్‌లో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయంలో ప్రజా రక్షణ బేరి 'చలో విజయవాడ' పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన ప్రజా రక్షణ బేరి యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రభుత్వం రంగాన్ని తెగనమ్ముతూ, ప్రజల ఆస్తులను అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇవ్వవచ్చునని అన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతున్నాయన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

నేడు సామాజిక సాధికార యాత్ర

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

అప్పలరాజు, మంత్రి

పలాస : కాశీబుగ్గలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రీజనల్ కో-ఆర్డినేటర్లు వై.వి.సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు అవుతారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో అధిక శాతం పదవులను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఇచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కెటి రోడ్డులో హిరంగ సభ ఉంటుందని అన్నారు.

ఉదయం 10.15 గంటలకు శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుంటుందన్నారు. ఉదయం 11:00 గంటలకు టెక్కలి కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకోవడం అనంతరం ప్రెస్‌మీట్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు టెక్కలి నుంచి బయలుదేరి పలాస చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు రామకృష్ణాపురం పవర్ గ్రిడ్ అతిథి గృహం చేరుకోని భోజన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పవర్ గ్రిడ్ గెస్ట్ హౌస్ నుంచి కోసంగిపురం కూడలికు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు 200 పడకల కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలిస్తామన్నారు. మధ్యాహ్నం 2:45 గంటంటలకు కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి నుంచి ప్రారంభమై వైఎస్ఆర్ స్క్వేర్ కాశీబుగ్గ చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కాశీబుగ్గ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి సామాజిక సాధికార బస్సు యాత్ర సభా ప్రారంభిస్తామని తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలన

టెక్కలి రూరల్ : పలాస నియోజవర్గం జగనన్న సామాజిక సాధికార బస్సు యాత్రకు టెక్కలి నుంచి ప్రారంభం సందర్భంగా టెక్కలి తోలుసూరుపల్లి రోడ్ ఎస్ కన్వెన్షన్ హాల్‌ను వైసిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ బస్సుయాత్రలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, ఉప సర్పంచ్ ప్రతినిధి ఎండు అప్పలరెడ్డి, సచివాలయం కన్వీనర్ జడ్యాడ జయరాం పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులు అంకితభావంతో లక్ష్యం దిశగా అహర్నిశలు కృషి చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. గార మండలం వమరవల్లి టీచర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్యచింతన లేకుండా అంకితభావంతో చదువుకుంటే లక్ష్య సాధనకు దోహదపడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ, ఆధునిక యంత్రాంగాన్ని కేవలం జ్ఞానం పెంచుకునేందుకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. కాలయాపన వల్ల అన్నిరంగాల్లో వెనకబడతామన్నారు. విద్యార్థి దశ ప్రతి వ్యక్తికీ ఎంతో కీలకమని అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. అప్పుడే సమాజంలో గౌరవాన్ని పొందగలరన్నారు. సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ భారతమ్మ, డైట్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, మోహనరావు డిమాండ్

శ్రీకాకుళం అర్బన్ : వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమండ్ చేశారు. రెండు నెలలుగా వర్షాలు లేక వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని వివరించారు. పలాస రెవెన్యూ డివిజన్లోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ఇంత కరువు పరిస్థితిలోనూ జిల్లాలోని ఒక్క మండలైనా కరువు మండలంగా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. నీరు లేక పంటలు ఎండిపో తుంటే ఈ జిల్లాలోని నాయకులకు కనిపించడం లేదా? అని వారు ప్రశ్నించారు. సాగునీరు లేక రైతులు రాత్రింబవళ్లు పొలాల్లో పడిగాపులు కాస్తున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి ఆయిల్ ఇంజిన్ల ద్వారా అవకాశం ఉన్నచోట నీటిని తోడుతున్నారు. జిల్లాలో నాగావళి, వంశధార, మహేంద్ర తనయా, బహుదా వంటి నదులు ఉన్నా... కాలువల నిర్వహణ లేక చివర భూములకు నీ అందించలేకపోతున్నామని అధికారులే చెపుతున్నాని అన్నారు. వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం పాలకులు గుర్తించకపోవడం శోచనీయమన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

నైతికత లేని సాధికార యాత్ర

- **వైసిపి పాలనలో దళితులపై దాడులు**
- **టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్**

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల కాలంలో ఆరు వేల మంది దళితులపై దాడులకు పాల్పడ్డారని, కొందరు హత్యకు గురయ్యారని, వారిపై దాడులు చేసిన వారిలో 80 శాతం మంది ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సామాజిక తరగతికి చెందిన రెడ్లేనని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 'నా ఎస్‌సి,, నా బిసి' అంటూ వేదికలపై చెప్పే జగన్ దాడులకు పాల్పడ్డ, హత్యలకు తెగబడ్డవారికి రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని భావించి... ఇప్పుడు ప్రేమ నటిస్తూ సాధికార బస్సు యాత్రలు చేస్తున్నారని అన్నారు. ఈ యాత్రలు చేసే నైతికత వైసిపి నాయకులకు ఎక్కడుందని ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు తన కారుడు డ్రైవరుగా ఉన్న వ్యక్తిని మత్య చేసి మృతిదేమాన్ని ఆకుటుంబానికి డోర్ డెలివరీ చేస్తే.. రాచమర్యాదలతో ఆయనను జైలు వద్ద నుంచి తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే కంచిక చర్లలో శ్యాం కుమార్ అనే దళితుడిని అమానుషంగా చంపారని అన్నారు. మంత్రి నాగార్జునకు ఆపదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. రూ.26 వేల కోట్ల ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించినా దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, సాంస్కృతి విభాగం అధ్యక్షులు. గుత్తు చిన్నారావు. ఎస్‌సి సెల్ అధ్యక్షులు తలగాన లక్ష్మణరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రత్యేక ఓటర్ల నమోదు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జి.సిగడాం : పాలఖండ్యాంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- జి.సిగడాం, శ్రీకాకుళం అర్బన్

అర్హులందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. మండలంలోని బాతువలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా విఆర్‌ఒ బి.పద్మావతి ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లునిండిన ప్రతిఒక్కరి ఓటరు నమోదు చేయాలన్నారు. అలాగే పాలఖండ్యాం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రాజకీయ పార్టీలు, బిఎల్‌ఒల కన్వీనర్‌తో ఎన్నికల ప్రత్యేక ఓటర్ల నమోదు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కలిగి ఓటును వినియోగించుకోవాలన్నారు. డిసెంబరు 9 నాటికి ఎవరు అయితే ఓటును నమోదు చేసుకుంటారో వారి ఓట్లు మాత్రమే వచ్చే ఎన్నికల్లో ఓటర్ జాబితాల్లో చేరుస్తామని అన్నారు. ఆదివారం, డిసెంబరు 2, 3 తేదీల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తహశీల్దార్ పి.వేణుగోపాలరావు అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌ఐ రామచంద్రరావు, కార్యదర్శి రాజారమేష్, దారబోయిన ధర్మరాజు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం గరంలోని ఎన్‌టిఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పరిశీలించారు. ఓటర్ తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు నమోదును పరిశీలించారు. మహిళలు, పురుషుల ఓటర్ల మధ్య వ్యత్యాసం గురించి ఆరాతీశారు. బూత్ లెవెల్ అధికారులకు ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకోవడంలో ఉన్న అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. ఈయనతో పాటు డిఆర్‌ఒ సిహెచ్. రంగయ్య, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, శ్రీకాకుళం రూరల్ మండల తహశీల్దార్ కె.వెంకటరరావు, బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

వైటిసిని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో ఐటిడిఎ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వైటిసిలో సూపర్-60 శిక్షణలో ఉన్న గిరిజన విద్యార్థులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ముచ్చటించారు. ఈ మేరకు నగరంలోని వైటిసిని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వసతి దీవెన, విద్యాదీవెన, సివిల్ సర్వీసు ప్రోత్సాహక పథకం, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ పథకాలు వినియోగించుకోవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సామాజికంగా వృద్ధి చెందడానికి వీలవుతుందన్నారు. తానూ గతంలో గిరిజన వసతిగృహంలో ఉండి చదువుకున్నానని, చక్కటి ఉద్యోగం సాధించానని చెప్పారు. ఆనాటి ప్రభుత్వాలు అందించిన ప్రోత్సామం అంతంతమాత్రమే అయినా... స్నేహితుల సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడ్డాయని అన్నారు. రాజకీయాల్లో తనవంతు సహాకారాన్ని అందిస్తున్నానన్నారు. ఇప్పుడు అవకాశాలు మెరుగు పడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చదువకునే విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహహిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్స్‌లో ర్యాంకులు సాధించేంతవరకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈయన వెంట ఐటిడిఎ డిడి మంగవేణి, మందస ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, సూపర్-60 కోర్సు డైరెక్టర్ బెండి మురళీధర్‌బాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి రాజన్నదొర

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

'దిశ' సమావేశంలో జెసి ఎం.నవీన్

సమీక్షిస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన అమలవుతున్న పథకాలను గ్రామ స్థాయిలోని చివరి పౌరునీ వరకు సక్రమంగా అందేలా, తద్వారా ప్రతి గ్రామాన్నీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేలా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సిఇఒ ఆర్.వెంకట్రామన్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం శనివారం నిర్వహించారు. సభ్య కార్యదర్శి హోదాలో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అన్ని ప్రజా సంక్షేమ పనులు, పథకాలను సంపూర్ణంగా అమలు చేయడానికి ప్రభుత్వ శాఖలు సరైన సమన్వయంతో ఉండాలని సూచించారు. మానవ వనరుల నిర్వహణ, బయో-మెడికల్ సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్, పలు శాఖల పరిధిలోని నిర్మాణాల స్థితి వంటి కీలకమైన అంశాలపై సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలపై క్షేత్ర పర్యటనలు నిర్వహించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కార్యక్రమం, మున్సిపాలిటీల్లో అమలవుతున్న అమృత్ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మిస్తున్న ఇళ్లు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించారు. ఇచ్ఛాపురంలో చెరువులపై ఆక్రమణలు తొలగించాలని, అమృత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నగర కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, డిఆర్‌డిఎ పీడీ ఎల్.విద్యాసాగర్, ఐసిడిఎస్ పిఒ బి.శాంతి, డ్వామా పీడీ చిట్టిరాజు, డిఎస్‌ఒ వెంకటరమణ, హౌసింగ్ పీడీ గణపతిరావు, జిల్లా వ్యవసాయ అధికారి కే శ్రీధర్, మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పలాస కాశీబుగ్గ చైర్మన్ బల్ల గిరిబాబు, సర్వే, మైన్స్, పంచాయతీరాజ్, ఎపి ఇపిడిసిఎల్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుడుల రాజకీయాలు

నేటి అస్థిత్వ రాజకీయాలు సుడిగుండంలో బొంగరంలా తిరుగుతున్నాయి. మరో వైపు ఊసరవెల్లి చందంగా ఆలోచనలు, వ్యూహాలు, ఆధిపత్య ధోరణలు క్షణం క్షణం రంగులు మారుతున్నాయి. జిల్లాలో రాజకీయాలు అందుకు మినహాయింపు కాదు. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికల్లో సరికొత్త వ్యూహాలకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాయి. అధికార పార్టీకి జిల్లాలో టెక్కలి నియోజకవర్గం లాంటి తలనొప్పులు వ్యవహారం వెంటాడుతున్నట్టు కనిపిస్తుంది. తొలుత దువ్వాడ శ్రీనివాస్ పార్టీ అభ్యర్థి ముఖ్యమంత్రి జగన్ టెక్కలి నియోజకవర్గ సభలో ముందస్తుగానే ప్రకటించారు. ఆ ప్రకటన హోరులో అసమ్మతిరాగం వినిపిచకుండా మరొకసారి సన్నద్ధమవుతున్న పి.తిలక్‌కు మండలికి పంపిస్తారని భరోసా ఇచ్చారు. ఆ భరోసా మన్ముందు ఎలా ఉన్నా అభ్యర్థి విషయంలో జగన్ మాట తప్ప, మడమ తిప్పిట్లు శ్రీనివాస్ ప్రకటనతో స్పష్టమైంది. నా భార్య వాణి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉంటారని శ్రీనివాస్ ప్రకటించారు. ఆమె అభ్యర్థిగా చూసుకుంటారన్న విషయాన్ని అధినేత చెప్పినట్లు వెల్లడించడం విశేషం. వారి కుటుంబంలో వచ్చిన బేధాభిప్రాయాలు వైసిపి రాజకీయాల్లో అస్థిత్వం నాట్యమాడుతున్నట్లు కనిపిస్తుంది. తాజా ప్రతిపాదనతో డాక్టర్ దానేటి శ్రీధర్ అభ్యర్థి అవుతారన్న ప్రతిపాదన ప్రచారానికి తెరదించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. శ్రీధర్ ప్రతిపాదనకు ఆ కుటుంబ సభ్యులు సముఖత చూపలేదని స్పష్టమవుతుంది. తాజాగా దువ్వాడ వాణి ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వచ్చినట్లు విశ్వసనీయంగానే తెలిసింది. ఆ కలయిక సమయంలో తన మనసులోని మాటను జగన్ ముందు బయటపెట్టిన అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మేమిద్దరంలో ఎవరు అభ్యర్థి అయినా ఇబ్బందులు ఎదురవుతాయని, అందువల్ల తన కుమార్తె హైందవికి టెక్కలి టిక్కెట్ ఇవ్వాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలిసింది. ఆమె ప్రతిపాదనలు జగన్ మౌనంగా విన్నారు తప్ప ఆయన నుంచి ఎలాంటి ప్రతి స్పందన లేదని తెలిసింది. 'తండ్రి వద్దు... తల్లీ వద్దు... బిడ్డే ముద్దు' అన్నట్లు జగన్ ముందు పెట్టిన ప్రతిపాదన ఇక్కడితో ఆగుతుందా? లేదా? అన్నది మున్ముందు తేలాల్సి ఉంటుంది. హైందవి డాక్టర్ కోర్సు పూర్తి చేసినట్లు తెలిసింది. ఆమె భర్త కూడా డాక్టరే అని తెలిసింది. ఇలాంటి ఆలోచన ఉండడంతోనే కూతురు, అల్లుడును రాజకీయ ప్రవేశం చేయించినట్లు తెలిసింది. వారిద్దరూ పార్టీ నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం ప్రచారంలో పాల్గొంటున్నట్లు తెలిసింది. అభ్యర్థి ఎంపిక విషయంలో టెక్కలి నియోజకవర్గ రాజకీయాలు సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నట్లు జరుగుతున్న పరిణామాలు చూస్తున్నాయి.

వైసిపి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో ప్రచారంలో ఉన్న అభ్యర్థులిద్దరూ వారసులకు టికెట్ ఇవ్వాలన్న కోరికపైన అధినేత మల్లగుల్లాలు పడుతున్నట్లు ప్రశాంత్ కిషోర్ బృందం చూపుతున్నట్లు సర్వేలో వారసుల ప్రజాధరణ ఇప్పటి వరకు సానుకూలంగా కనిపించలేదని తెలిసింది. వారసులకు టిక్కెట్ ఇస్తే ఒక ఇంటి రెండు పదువులకు లోపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసిపి అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి దృష్టిసారించలేదని తెలిసింది. చంద్రబాబు అరెస్టుతో టిడిపి ప్రచారం చప్పగా మారింది. తమకు పనిలేదు.. పదవీ లేదు అన్న రీతిలో ఉన్న వైసిపి కార్యకర్తలకు ఎలా జనంలోకి దూసుకుపోవాలన్నది జిల్లా నేతలు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. జగన్ ఏదో ఒక కార్యక్రమం ఇస్తున్నా... జిల్లా ముఖ్య నేతలు కొందరు, ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రమే పనిలో ఉన్నారన్న తెలిసింది. టిడిపి, జనసేన పొత్తు ప్రకటనతో రెండు నియోజకవర్గ ఎన్నికల్లోనే కదలికలు మొదలయ్యాయి. పవన్‌కళ్యాణ్ సామాజిక తరగతి అంశానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాతపట్నం, ఎచ్చెర్ల వైపు నేతల దృష్టి ప్రధానంగా జనసేన ఆశావహుల దృష్టి మళ్లినట్లు కనిపిస్తుంది. దీంతో టిడిపి కార్యకర్తల్లో కదలికలు మొదలయ్యాయి. జిల్లాకు ఒక సీటు జనసేన జాబితాలో చేరే అవకాశం ఉందని టిడిపి సీనియర్లు చెబుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో జనసేనకు చోటు ఇవ్వకుండా ఒక దెబ్బకు రెండు పిల్లలు అన్న చందంగా మారుతుందని ఆధిపత్య గ్రూపు నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ అంశం రావడంతో పలాస కేటాయిస్తారన్న ప్రచారానికి తలుపులు పడినట్టు తెలిసింది. ఇప్పటి వరకు టిడిపి అభ్యర్థుల విషయంలో ఎలాంటి మార్పు ఉండేందుకు అవకాశం లేదని తెలిసింది. నరసన్నపేట అభ్యర్థి విషయంలోనూ ఎలాంటి మార్పు ఉండదని టిడిపిలో నెలకున్న పరిణామాలు చెబుతున్నాయి. జనసేన అధినేత వ్యాఖ్యలు జిల్లాలోని టిడిపి నేతలకు, కార్యకర్తలకు మింగుడు పడడం లేదని తెలిసింది. పొత్తు అంశం ఉండడంతో ఎవరూ నోరువిప్పడం లేదు. ఏదైనా జిల్లాలో ప్రచారంలో టిడిపి మాత్రం వెనుకబడిందనే చెప్పాలి. బలాబలాల పొందికలో ఎలాంటి మార్పులు ఉంటాయన్నది మరో నాలుగైదు నెలలు గడిస్తే తప్ప అంచనా వేయలేం.

- సత్తారు భాస్కరరావు

పేరు మార్పు

శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, ఎన్.టి.ఆర్. కాలనీ, డో.నెం. 6-215కి చెందిన రెళ్ళా వరలక్ష్మి అను నేను నాయొక్క పేరు మార్పు చేయవలసిందిగా కోరుచున్నాను. ఇంతకు ముందు వి.ఎల్.ఎన్.దుర్గా కుమారి బి (పాత పేరు) అని ఉన్న పేరును రెళ్ళా వరలక్ష్మి (కొత్త పేరు) గా మార్చవలసిందిగా కోరుచున్నాను.

రెళ్ళా వరలక్ష్మి
భర్త: హరిశంకర్ నెహ్రూ, ఎన్.టి.ఆర్. కాలనీ, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా.
సెల్: 91103 80284

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

ప్రజాశక్తి- రణస్థలం
ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం వంటిదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శనివారం బంటుపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ఉద్దేశ్యంతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మార్చడమే సిఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైసిపి నాయకులు పాశపు ముకుందరావు, ఎంపిడిఒ రమణమూర్తి, మండల ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు సుమన్, వైసిపి నాయకులు, సర్పంచ్ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
శ్రీకాకుళం సిపిఒ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి వై.వెంకటప్పడు భార్య లలా కోటేశ్వరికి శనివారం కారుణ్య నియామక ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేశారు. కుటుంబానికి ఆర్థిక భద్రత దృష్ట్యా ఈనియామకాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను పొందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేటరు నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి కె. వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బి.వి. నర్సింగరావు, అసోసియేషన్ ప్రతినిధులు బడగల పూర్ణచంద్రరావు, అట్ల సూర్యప్రకాష్, షేక్ బాషా, క్లాస్-4 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చింతల ఉమా శంకర్, మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మణి

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఆమదాలవలస: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో శిశు సంరక్షణ, బాలల హక్కులపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు పౌష్టికాహార సక్రమంగా అందిస్తే బాలలు ఆరోగ్యంగా ఉంటారని, చదువులో శ్రద్ధ చూపెడతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాయని వాటిని సక్రమంగా బాలలకు అందించాల్సిన బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కణితి విజయలక్ష్మి భాయ్, న్యాయవాదులు పేడాడ గోవిందరావు, పాతిన వరహానరసింహం, బొడ్డేపల్లి మోహనరావు, కింతలి త్రినాథరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నందిగాం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నూరుల్ కమర్

ప్రజాశక్తి- నందిగాం
మండలంలో నందిగాంలో 3, బెజ్జిపల్లిలో1, సవరలింగపురంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. ఓటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరికీ ఓటు నమోదు చేయాలని సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ వై.వి.పద్మావతి ఉన్నారు.

రణస్థలం : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ అన్నారు. శనివారం రణస్థలం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా నంబర్లు వేయించాలన్నారు. 18 సంవత్సరాలు నిండే యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఓటును పరిశీలన చేసుకోవాలని, జాబితా పరిశీలన తదుపరి ఏమైనా తప్పులుంటే నిర్ణీత ఫారాల్లో సవరణలు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకోవాలని విధిగా ఓటర్లకు అవగాహన కల్పించాలని బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. చనిపోయిన ఓటరు వివరాలు సేకరించి వివరణ చేసి నోటీసులు జారీ చేసిన తదుపరి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిటి విజయనిర్మల, పలు పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే స్వీకరించాలని తహశీల్దార్ బి.అప్పలస్వామి సూచించారు. శనివారం వజ్రపుకొత్తూరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీల్లో బిఎల్‌ఒలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. 18 ఏళ్ళ నిండిన ప్రతి పౌరునికి ఓటుహక్కు కల్పించడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు డిటి వాయిలపల్లి గిరిరాజ్, కార్యదర్శి యాదవరాజు, వీఆర్‌ఒలు, బిఎల్‌ఒలు ఉన్నారు.

రణస్థలం : ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు

మంత్రి సీదిరికి జర్నలిస్టుల సన్మానం

పలాస: రాష్ట్రమంత్రి వద్ద సమావేశంలో జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు క్యాబినెట్‌లో మంత్రివర్గం అంగీకరించడం పట్ల ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి డి.మహారాణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాస, కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా మహారణ మాట్లాడుతూ ప్రభుత్వం సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకుందని, దీనివలన జిల్లాలో గల అనేక మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరవుతాయన్నారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అనేక మంది విధులు నిర్వహిస్తున్నా కొంతమందికే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడేషన్లు పొంది ఉన్నారని, మిగిలిన జర్నలిస్టులకు అక్రిడేషన్లు లేకపోయినా అనేక పత్రికల్లో విలేకరులుగా పని చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వారికి కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జగదీష్, రమణ, నారాయణ, రాము, హరి, భాస్కరరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నేతాజీ, రవి, కొంచాడ రవి, జయంత్, మోహన్, మేఘన, కింజరాపు కృష్ణ, శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహానికి జర్నలిస్టులు పాలాభిషేకం

ప్రజాశక్తి- నరసన్నపేట
రాష్ట్రంలో అక్రిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం పట్ల నరసన్నపేట జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నరసన్నపేట వైఎస్‌ఆర్ జంక్షన్ వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి, నరసన్నపేట నియోజకవర్గ యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఎపిపిఎస్‌సి పరీక్షలపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు తమ లక్ష్య సాధనకోసం నిరంతరం తపన పడాలని, ఇష్టంగా చదివితే ఉన్నత శిఖరాలను అందుకోగలరని సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరక్టర్ బాల లత సూచించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎపిపిఎస్‌సి, యుపిపిఎస్‌సి పరీక్షల పట్ల అవగహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సులో ఆమె హాజరై పరీక్షల నిర్వహణపై ఈ సదస్సులో మహిళా కళాశాల ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ మెంటారు నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టెక్కం రాంగోపాల్, అధ్యాపకులు హాజరయ్యారు.

అవగహన కల్పిస్తున్న బాల లత

అరాచక పాలనకు అంతం తప్పదు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలన అంతంకాక తప్పదని ఎమ్మెల్యే అశోక్ ధ్వజమెత్తారు. శనివారం మండలంలో తీరప్రాంత గ్రామం డొంకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రసంగించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక శక్తుల అగాడాలు అంతు లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అంతం తప్పదని జోస్యం చెప్పారు. ముందుగా గ్రామంలో పర్యటించి వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి పెరిగిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, సదనందా రౌలూ, సహదేవ రెడ్డి, లోపింటి పద్మనాభం, లోకనాథం, పరుశురాం, కామేశ్వరరావు, ప్రకాష్‌నాయక్, నందిక జాని, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

మందస: మండలం అంబుగాం పంచాయతీ పరిధిలో టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన నేతృత్వంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా, రైతులు రాజుల్లా బతకాలన్నా మళ్లీ చంద్రబాబు సీఎం అవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, చౌదరి మురళి, లచ్చయ్య, సిర్ల కృష్ణారావు, ముడుముంచి నవీన్ కుమార్, బత్తని తారకశ్వరావు పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస
మందస మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలం అంబుగాం, చిన్న లింబుగాం గ్రామాల్లో బాబు ష్యూరిటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి చౌదరి మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు మండల లచ్చయ్య, జిల్లా బిసిసెల్ కార్యదర్శి సిర్ల కృష్ణారావు, తెలుగుయువత అధ్యక్షుడు ముడుముంచి నవీన్ కుమార్, బూత్ లెవల్ ఏజెంట్‌లు హరికృష్ణ, మండల మాధవరావు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు జగన్నాయకులు

ప్రజాశక్తి- పలాస
దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు 6వ వర్ధంతిని పునస్కరించుకొని మండలంలో హరిపురం, బేతాళపురం, నారాయణపురం, బిడిమి వద్ద జగన్నాయకులు శిలా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సతీమని జుత్తు ధనలక్ష్మి సోదరుడు జుట్టు నీలకంఠ చైతన్య, రైతాంగ సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు నివాళ్లర్పించారు. హరిపురంలో జగన్నాయకులు విగ్రహానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరిఅప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పలాస నియోజకవర్గం నాయకులు శాసనసభ లో తన బాని వినిపించి ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల హదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ దాన యాదవ్, వైసిపి మండల అధ్యక్షుడు అగొన్న సూర్యారావు, సర్పంచ్ పురుషోత్తం, ఎంపిటిసి అప్పన్న, వైసిపి నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల బిజెపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 9:30 గంటలకు జిల్లాపార్టీ అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఇఆర్) అధ్యక్షతన ఎచ్చెర్ల బిజెపి క్యాంప్ కార్యాలయంలో జరుగుతుందని పార్టీ కార్యదర్శి మన్నె సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాలుగు మండలాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల పధాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

స్పందన కార్యక్రమంలో పాల్గొన్న భవానీశంకర్

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక స్పందన కార్యక్రమం మండల ప్రత్యేకాధికారి భవాని శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు నాలుగు వినతులు అందాయి. వచ్చిన ఫిర్యాదులకు తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎస్ఐ రాజేష్, ఎంఇఒ దేవేంద్రరావు, మండల పరిషత్ ఎఒ తిరుపతి పట్నాయక్, ఎస్.కృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ప్రజలు, పాలక మండలి సభ్యుల సమక్షంలో హుండీలను తెరిచారు. 61 రోజుల పాటు యాత్రికుల నుంచి కానుకలు, నగదు రూపంలో వచ్చిన ఆదాయం రూ.47,62,810 సమకూరింది. వాటిలో నోట్లు రూపంలో రూ. 46,18,290, చిల్లర నాణేలు రూపంలో రూ.1,44,520 సమకూరింది. వీటితో పాటు బంగారం 26 .500 గ్రాములు, వెండి 2 .200 కేజీలు, విదేశీ మారక ద్రవ్యం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 1డాలర్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ 10 పౌండ్స్ వచ్చాయని ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సూపరింటెండెంట్ బిఆర్‌వివి ప్రసాద్ పట్నాయక్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనురాధ, జివిబి ఎస్. రవికుమార్, కృష్ణమాచార్యులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

వేతన బిల్లులు సమర్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
గౌరవ వేతనాల బిల్లులు సకాలంలో సమర్పించాలని డిఆర్ఒ గణపతిరావు అన్నారు. ప్రభుత్వానికి జిల్లాలో వ్యతిరేకంగా నమోదైన కేసుల్లో పారా వైస్ రిమార్కులు ఇవ్వడంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు సకాలంలో స్పందించాలని కోరారు. గవర్నమెంట్ ప్లీడర్లు, ఎజిపిలతో శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్లీడర్లకు, జిపికు గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులను సకాలంలో సమర్పించాలన్నారు. కోర్టు కేసుల్లో ఎలాంటి డీవియేషన్లు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులపై ఉన్న కేసులపై సమర్థవంతంగా వాదనలు వినిపించాలన్నారు. సమావేశంలో జిపి వినయ భూషణ్, ఎజిపి గొండు సత్యం, జిల్లాలోని పలు కోర్టుల ప్రభుత్వ న్యాయవాదులు హాజరయ్యారు.

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి

ఆమదాలవలస: సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి ఎంతో ఆనందం కలుగుతుందని కృతిక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి చిన్ను అన్నారు. శనివారం శ్రీకాకుళం పట్టణానికి చెందిన సీపాన కేదారి జన్మదినం సందర్భంగా కృతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు, వృద్ధులకు, వికలాంగులకు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా చిన్ను మాట్లాడుతూ భవిష్యత్తులో పెద్దఎత్తున సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోఅశోక్, గురుగుబెల్లి ఈశ్వర్, పవన్, తేజ, సాయి, రాజేష్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్
పత్తి పంటలో పురుగు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు సాదించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ డా. యస్. కిరణ్ కుమార్, రణస్థలం ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు అన్నారు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం రణస్థలం, లావేరు మండలాల ఆర్‌బికె ఇన్‌ఛార్జులకు మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెట్టకి తట్టుకోవడానికి మల్టీ కె (13-0-45) కేజీ ఒక ఎకరానికి వాడాలని చెప్పారు. రబీ పత్తి, మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు, ఎరువులు, చీడపీడల, కత్తెర పురుగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి వై.సూర్యకుమారి, ఎఒలు డి.విజయ భాస్కరరావు, డి.మహేష్ నాయుడు, లేబ్ ఎఒ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

కడుమలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి- కొత్తూరు
మండలంలో కడుమ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వలురౌతు షణ్ముఖరావుకు చెందిన పంట పొలంలో నవరదేసి రకం వరి పంటను పంట పంటకోత ప్రయోగం నిర్వహించగా 8.250 దిగుబడి వచ్చిందన్నారు. దీని ప్రకారం ఎకరాకు 16 బస్తాలు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. పంటలో ఎటువంటి రసాయనిక పురుగు మందులు వాడలేదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.జనార్ధన, కేశవ, సంజీవరావు, కృష్ణవేణి వున్నారు.

కొత్తూరు : పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

మానసిక వికలాంగుల ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
మానసిక వికలాంగుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనో వికాస కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శీతాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని, అందువల్ల వికలాంగులైన వారిపై తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అంకిత భావం, సేవా దృక్పథంతో కేంద్రంలో సిబ్బంది సేవలందించాలని సూచించారు. వృత్తి విద్య నేర్పించాలని, తరుచుగా ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాలను కేంద్ర నిర్వాహకులు బి.విజయకుమార్, శేఖర్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అంతకుముందు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. అనంతరం వారికి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేశ్వరరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది, బ్రెడ్స్, వైసిబి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

పులి జాడలపై సమాచారం అందించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
గత కొద్ది రోజులుగా పెద్దపులి జాడ తెలియక రకరకాల పుకార్లుతో ప్రజలు భయాందోళనకు గురువుతున్నారని అధికార యంత్రాంగం సమగ్ర సమాచారం ఇచ్చి పులి బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఉద్దానంలో బతకడానికే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో 10 రోజులుగా పెద్దపులి రూపంలో మరో సమస్య మనల్ని చుట్టు ముట్టేసిందన్నారు. గత పది రోజులుగా పెద్దపులి సంచారం ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఎన్నో మూగజీవాలు ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం ఇన్ని రోజులుగా సమస్యను గుర్తించి సమాచారం అందివ్వడం తప్పా పరిష్కారపు జాడలు ఎక్కడా లేవన్నారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుని ప్రాణనష్టం జరగకుండా ఫారెస్ట్ అధికారులను, ఆధునిక యంత్రాంగాలను ఉపయోగించి పులి, పులుల జాడని కనిపెట్టి ఉద్ధానం సమస్యను పరిష్కరించాలని జనసేనపార్టీ తరపున కోరారు.

కొనసాగుతున్న ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి- పలాస
పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలపై శుక్రవారం అర్ధరాత్రి వరకు తనిఖీలు నిర్వహించగా రెండోరోజు శనివారం శ్రీకాకుళం ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎసిబి సిఐలు కె.భాస్కరరావు, హరి, ఎస్‌వి రమణతో పాటు 10 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి కొంతమంది ఎసిబి అధికారులు కార్యాలయంలో రికార్డులు పరిశీలించగా మరికొంత మంది భవననిర్మాణ పనులను పరిశీలించారు. కార్యాలయం లోపలికి బయటవ్యక్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమక్షంలో ఆన్‌లైన్ రికార్డులు పరిశీలించారు. మొదటిరోజు ఐదు భవనాల రికార్డులు పరిశీలించగా, రెండోరోజు 11 భవన నిర్మాణ పనులకు సంబంధించి రికార్డులు, భవనాలు పరిశీలించినట్లు తెలుస్తోంది.


టౌన్‌ప్లానింగ్ విభాగంలో తనిఖీలు చేపడుతున్న ఎసిబి అధికారులు

మాట్లాడుతున్న మండల ఎఒ మోహనరావు

ఆరుతడి పంటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస
రబీ సీజన్లో ఆరుతడి పంటలను వేసుకోవాలని వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కొరపాం రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలిసి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్నారు. కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలులో రవాణా కోసం ఉపయోగించే వాహనాలకు జిపిఎస్ కోసం ముందుగానే రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 7వ తేదీన రెండోవిడత రైతుభరోసా నిధులు సిఎం జగన్మోహన్ రెడ్డి విడుదల చేస్తారని తెలిపారు. రబీ సీజన్లో ఆరుతడి పంటలైన పెసర, మినుము, నువ్వులు, రాగులు వంటి పంటలను పండించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలోఎస్.రాజశేఖర్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

చిన్నగురు స్వామికి ప్రశంసలు

ఇచ్ఛాపురం: సింహాచలం పుణ్యక్షేత్రంలో అలరించిన భక్తి రంజని ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సింహాచలం పుణ్యక్షేత్రంలో స్వామి వారి ఎదురుగా ఇచ్ఛాపురం శ్రీవెంకటేశ్వర భక్తి రంజని కళాబందం సభ్యులు ఆలా పనకు ప్రశంసలు అందుకున్నారు. చిన్న గురుస్వామి, నీలాపు మనీషా, కీబోర్డ్ హేమంత్ కుమార్ బాడిత్య తబలాపై నిత్యానంద్ బాడిత్య తమదైన శైలిలో చక్కటి అన్నమయ్య కీర్తనలు, భక్త రామదాసు కీర్తనలు, లక్ష్మీ నరసింహ స్వామి కీర్తనలు, ఘంటసాల పాడిన భగవద్గీత చక్కగా ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కళాకారులకు సింహాచలం దేవస్థానం ట్రస్టు, ఆలయ అర్చకులు, కార్యక్రమం కో-ఆర్డినేటర్ మారుతీరావు కళాకారులకు సత్కరించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
వర్షాభావ పరిస్థితులు కారణంగా ఎండిపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పలాస వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.వి మధు అన్నారు. శనివారం మండలంలో గోవిందపురం, పొల్లాడ, కోమరల్తాడ, దేవునల్తాడ, ఎస్‌జె పురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. సుమారు 500 ఎకరాలకు పైబడి పంట పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. పొట్ట దశలో పంటలు ఎండిపోయిన తమకు న్యాయం చేయాలని రైతులు ఆయన వద్ద తమ గోడు వినిపించారు. రైతులకు ప్రభుత్వం తరపున సహాయం అందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎఒ కిరణ్ వాణీ, ఎఇఒ జ్యోత్స్న, ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు కుసుమకుమారి, శివ, పవన్, సంతోష్, సర్పంచ్ అట్టాడ గోపి, రైతులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రయివేటు వాహనాలే దిక్కు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గ మండలాల్లో మారుమూల గ్రామాలకు ఇప్పటికీ ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. గతంలో రహదారులు బాగోలేనప్పటికీ ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం గ్రామాలకు కూడా చక్కని రహదారులున్నాయి. ప్రయాణాలకు ఎలాంటి ఆటంకం లేకపోయినా బస్సులు పల్లెలకు వెళ్ళకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని తిరుగుతున్న ప్రైవేటు వాహనాలను రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్‌టిసిబస్సులు సమయపాలన పాటించక పోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. త్వరగా గమ్యం చేరాలన్న ఉద్దేశ్యంతో ప్రయాణికులు అధికచార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు. కిక్కిరిసిన వాహనాల్లో ప్రయాణించడం వలన కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. టెక్కలి ఆర్‌టిసి డిపో మెనేజర్‌కు కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తమ గ్రామాలకు రోడ్డు బాగా ఉన్నప్పటికీ బస్సులు రాకపోవడంతో టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం కళాశాలలకు, వివిధ పనులు కోసం వెళ్లే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పినప్పుడు వారు రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని, కొన్ని గ్రామాలకు నడిపే సర్వీసులకు ఆదాయం తక్కువగా ఉండటంతో గతంలో నిలుపుదల చేశామని, పరిశీలించి బస్సులు నడుపుతామని సమాధానం చెప్పి వెళ్ళిపోతున్నారు తప్పా ఇప్పటివరకు బస్సులుమాత్రం వేయటం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పల్లెలకు ఆర్‌టిసి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

దంత రోడ్డులో ఆటోపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు

సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పేదల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- పోలాకి

పేదప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం దీర్ఘాశి పంచాయతీ పరిధిలో కింజరాపువానిపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలను అవగాహన కల్పించారు, అలాగే సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిఇసి సభ్యులు ధర్మాన పద్మప్రియ, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మెండ సుమంగళి కృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి పాకోటి తాతబాబు అధికారులు పాల్గొన్నారు.

తారురోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కొవ్వాడ గ్రామంలో అణువిద్యుత్ నిధులు రూ.కోటి 25లక్షల వ్యయంతో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తారురోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని అణువిద్యుత్ అధికారుల దృష్టిలో పెట్టిన వెంటనే తారురోడ్డు మంజూరు చేయడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, టెలికాం డైరెక్టర్ బడి రాంబాబు, అణువిద్యుత్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ బంగారయ్య శెట్టి, ఇంజనీర్ రవికుమార్, సర్పంచ్ అల్లిపల్లి రాముడు, వైసిపి నాయకులు గురువులు, జగ్గులు, పట్టయ్య, అల్లిపల్లి అప్పన్న, రాముడు, సర్పంచ్‌లు. ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సహకార రంగాల అభివృద్ధికి కృషి

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సహకార రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం పట్టణంలో రూ.75.50 లక్షల నిధులతో కృష్ణాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా సిఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల్లో ఎరువులు, విత్తనాల కోసం రైతులు పడిన ఆగచాట్లు చూశామని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుతున్నాయన్నారు. రైతులకు రైతుభరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిస్తుందని, అలాగే సున్నావడ్డీ రుణాలను కూడా మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ ప్రెసిడెంట్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, సహకార బ్యాంకు డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, తిర్లంగి రామారావు, నక్క కన్నం నాయుడు, గురుగుబెల్లి నీలారావు, జిల్లా సహకార అధికారి బి. నగేష్ కుమార్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ దూది సంధ్యారాణి, పిఎసిఎస్ సిఇఒ గంగు మన్మథరావు పాల్గొన్నారు.

పింఛను అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కిడ్నీ వ్యాధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం కిడ్నీ వ్యాధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం లండారిపుట్టుగ గ్రామానికి చెందిన మామిడి గంగులుకు మంజూరైన డయాలసిస్ పింఛన్ రూ.10వేలు శనివారం ఎమ్మెల్సీ అందించి మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీవ్యాధి బాధితులపై చిత్తశుద్ధితో వ్యవహరించింది వైసిపి ప్రభుత్వమని, కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు అందించడమే కాకుండా డయాలసిస్ బెడ్లు పెంచడం, కిడ్నీ రోగులకు రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేలు పింఛన్ అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నర్తు శివాజీ పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న తులసీదాస్‌రెడ్డి

స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో అంతర్ కళాశాలల స్విమ్మింగ్ పోటీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన స్వర్ణ భారతి ఇంటర్ విద్యార్థులు నిరాకార బెహరా, తరుణ్ బెహరాకు విద్యాసంస్థ చైర్మెన్ చాటల తులసీదాస్ రెడ్డి అభినందించారు. సామాజికంగా వెనుకబడిన కండర కులస్తులు ఎన్ని సమస్యలు ఉన్న స్విమ్మింగ్‌లో అత్యంత ప్రతిభా కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షణీయమన్నారు. ప్రిన్సిపాల్ జల్లు జై ప్రకాష్, పిఇటి ప్రసాద్, స్విమ్మింగ్ కోచ్ రామారావు పాల్గొన్నారు.

బొందికారిలో పెద్దపులి పాదముద్రలు

పలాస : ఒడిస్సా-ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో గత కొద్దిరోజులుగా ప్రజలకు పెద్దపులి కంటికి నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఒడిస్సా లావణ్యకోట, పెదహంస గ్రామాల మీదుగా పలాస మండలం లొత్తూరు గిరిజన ప్రాంతాలకు వారంరోజులు క్రితం తిరిగిన పెద్దపులి శుక్రవారం మందస మండలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం మందస మండలం చీపి పంచాయతీ బొందికారి గ్రామ సమీపంలో పెద్దపులి పాదముద్రలను గిరిజనులు గుర్తించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అటవీ శాఖాధికారులు బొందికారి గ్రామానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం గ్రామ సమీపంలో పెద్దపులి అడుగులు గిరిజనులకు ఆందోళనలకు గురిచేస్తుందని ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షులు సవర జగన్నాయకులు తెలిపారు.

బావాజీ మఠం భూములపై 'అమ్మ' కన్ను!

రూ.కోట్ల విలువ చేసే భూములు అక్రమ రిజిస్ట్రేషన్

ప్రొక్లెయినర్‌తో భూమిని చదును చేయడానికి వచ్చిన బినామీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో తోటాడ రెవెన్యూ పరిధిలో జగన్నాథ స్వామి బావాజీ మఠం భూములపై అమ్మ కన్ను పడడంతో కోట్ల విలువ చేసే భూములు తన అనుచరుల పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. శనివారం ఆ స్థలంలోకి సుమారు 20 మంది జిమ్ యువకులను వెంట బెట్టుకొని ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి అమ్మ నమ్మినబంటు, ఆమదాలవలస మండలానికి చెందిన ఓ సర్పంచ్ అక్కడకు వెళ్లారు. దీంతో బావాజీ మఠానికి చెందిన వారు అక్కడకు చేరుకోవడంతో వారి మధ్య వివాదం నెలకుంది. శ్రీకాకుళం జగన్నాథస్వామి, పీఠధిపతుల ఆధీనంలో ఉన్న 199 ఎకరాల భూములపై గత కొంతకాలం నుండి అధికార పార్టీ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మఠానికి చెందిన అర్చకులు మధ్య గతకొంత కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. గతంలో ఈ భూములపై భారీస్థాయిలో వివాదం చెలరేగి రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశం కావడంతో ఏకంగా సిఎంఒ కార్యాలయం నుండి దీనిపై ఆరా తీయడం, చివరికి మఠాధిపతులు హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. ప్రస్తుతం ఈ బావాజీ మఠం భూముల వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ శనివారం బావాజీ మఠం భూముల్లో వివాదం చెలరేగింది. మళ్లీ మఠంభూములు వ్యవహారం వివాదాలుగా మారి కొత్త రిజిస్ట్రేషన్లు తెరమీదకు వచ్చాయి. ఈ ప్రాంతానికి చెందిన సుమారు 5 ఎకరాల 60 సెంట్లు భూమి సుభాష్ పండ అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేశారని, పనులు ప్రారంభించడానికి ఒక వర్గం వారు శనివారం చేరుకోగా జగన్నాథస్వామి మఠంకు చెందిన వ్యక్తులు చేరుకున్నారు. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని ఇరువర్గాల వారిని పత్రాలతో సాయంత్రం ఐదు గంటలకు స్టేషన్‌కు రావాలని తెలిపారు. ఈ సంఘటనపై జగన్నాథ స్వామి ఆలయ అర్చకుడు సంతోష్ బ్రహ్మ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు 11మంది మఠాధిపతులు మారారని, వందల సంవత్సరాల నుండి తోటవాడ రెవెన్యూ గ్రామానికి చెందిన 121వ సర్వే నెంబరులో 199 ఎకరాల భూమి ములుగు బావాజీ పీఠాధిపతి ఆధీనంలో ఉండేవని ఆయన తెలిపారు. అయితే సుభాష్ పండ అనే వ్యక్తి బావాజీ అంటూ చెప్పుకుంటూ తోటవాడ రెవెన్యూ గ్రామంలో లేని 120

పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణ

పి సర్వే నెంబర్‌తో తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఆమదాలవలస నియోజ కవర్గానికి చెందిన ఒక రాజకీయ నాయకుని ప్రోద్భలంతో కొంతమంది రౌడీమూకలు తమపై దౌర్జన్యం చేస్తూ జెసిబిలు ఇతర యంత్రాలతో తమ పంటలను నాశనం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రజాప్రతినిధులు జిల్లాలో జరుగుతున్న భూదందాలపై చర్యలు చేపట్టి తమలాంటి అర్చకులను రక్షించడంతో పాటు మఠాలకు చెందిన భూములను కూడా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. పోలీసులు కూడా ఇరువర్గాల పత్రాలను పరిశీలించకుండా రాజకీయ నాయకుల ఆదేశాలకే వత్తాసు పలుకుతున్నారని సంతోష్ బ్రహ్మ ఆరోపించారు.

మురుగునీటి సమస్యపై రోడ్డు దిగ్బంధం

18 మంది అరెస్టు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక.ప్రభుత్వ కళాశాల రహదారిలో గతేడాది నుండి మురుగునీరు, వర్షపునీరు రహదారిపై పారుతుండంతో పాదచారులు, వాహనదారులు, స్థానికవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదులు, విద్యార్థులతో రహదారి బైటాయింపు, రిలేదీక్షలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికవాసులచే చేపట్టారు. అలాగే మురుగునీరు సమస్యతో రహదారి పక్కనున్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోకి మురుగునీరు, వర్షపునీరు వెళ్లిపోవడంతో సబ్ కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వసతి గృహం విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మాణం చేపట్టిన బాలికల వసతి గృహంలోకి తరలించారు. అయితే మురుగునీరు సమస్య పరిష్కరించలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో మురుగునీరు సమస్య పరిష్కరించాలంటూ స్థానిక నివాసవాసులతో రహదారి దిగ్బంధం చేయడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో సిఐ ఆర్ వేణుగోపాలరావు జోక్యంతో పోలీసులు ఆందోళన చేసిన వారిని బలవంతంగా జీపెక్కించి పోలీసుస్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మూసివున్న ఆర్‌అండ్‌బి కల్వర్ట్ తెరిపించి మురుగునీరు సమస్య పరిష్కరించే వరకు

నిలిచిన వాహనాలు (ఇన్‌సెట్‌లో ప్రసాద్‌ను బలవంతంగా జీపు ఎక్కిస్తున్న పోలీసులు

ఆందోళనను ఉధృతం చేస్తామని, పోలీసులు అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. వైశ్యారాజు పైడిరాజు, బి.మహేష్, వాసు, రమేష్ ఉన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్నతో పాటు మరో 18 మందిని ఇన్‌ఛార్జి ఎస్ఐ నారాయణ స్వామి అరెస్టు చేసి విడుదల చేశారు.

ఆహార విక్రయ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

హోటల్‌ను పరిశీలిస్తున్న ఉషోదయ యువజన సంఘం సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పానీపూరీ కేంద్రాలు, హోటళ్లు నిబంధనలు పాటించి, వంటకాల్లో ఘాటు తగ్గించడమే కాకుండా ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు వినియో గించకుండా ఉండాలని ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఉషోదయ కార్యాలయంలో ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ వైద్యుని వద్దకు వెళ్లినా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ఆహారం మానేస్తే మందులు అవసరం లేదంటున్నారని, హోటళ్లలో వాడుతున్న చైనాసాల్ట్, వివిధ రకాల రంగులు, నాసిరకం వంట నూనెలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇటీవల దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తపై సమావేశంలో చర్చించారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఇకపై మేలైన వంట పదార్థాలు ఉపయోగించటమే కాకుండా ప్రజారోగ్యానికి హాని కలిగించే ఎటువంటి పదార్థాలు వాడకూడదని సూచించారు. అనంతరం కవిటిలో ఉన్న పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం సభ్యులు ఆరింగి మధు, పి.వెంకటరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆరింగి రాజు, టి మోహనరావు, పి దశరథ్, పి సింహాచలం, బి రవి, ఆనంద్, జె లోకనాథం పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి గ్రిగ్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలస్థాయిలో గ్రిగ్స్ పోటీలకు జట్లు ఎంపికను శనివారం నగరంపల్లిలో నిర్వహించారు. బాలుర వాలీబాల్ విభాగంలో సీనియర్స్ నుండి ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్ అక్కుపల్లి, పాతటెక్కలి ఉన్నత పాఠశాల, జూనియర్స్ నుండి ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్ అక్కుపల్లి, బాతుపురం ఉన్నత పాఠశాల జట్లు ఎంపికయ్యాయి. అలాగే బాలికల వాలీబాల్ సీనియర్ విభాగంలో డోకులపాడు, బాతుపురం ఉన్నత పాఠశాల జట్లు, జూనియర్స్ బాతుపురం, డోకులపాడు ఉన్నత పాఠశాల జట్లు ఎంపికయ్యాయి. అలాగే బాలుర ఖోఖో పోటీలకు సీనియర్స్ నుండి నగరంపల్లి ఉన్నత పాఠశాల, పూండి సాయి వినీత స్కూల్ జట్లు, బాలుర జూనియర్స్‌లో నగరంపల్లి, పిఎం పురం ఉన్నత పాఠశాల జట్లు ఎంపికయ్యాయి. అదే విధంగా బాలికల ఖోఖో పోటీలకు

పోటీలను ప్రారంభిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సీనియర్స్ నుండి నగరంపల్లి, దేవునల్తాడ ఉన్నత పాఠశాల జట్లు, బాలికల జూనియర్స్ నుండి నగరంపల్లి, అమలపాడు ఉన్నత పాఠశాల జట్లు ఎంపికయ్యారు. ఈ జట్లు కంచిలి మండలం ఎంఎస్ పల్లిలో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఇఒ దశరధరావు, రాష్ట్ర పిఇటి సంఘం కార్యదర్శి తవిటయ్య, జోన్ 1 కార్యదర్శి పైల గజేంద్ర, ఎంఎస్ఒ చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్, జి. హరినాథ్, లోకేష్ పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ ఉక్కు పోరాటానికి ఈ నెల 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తదితర డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపు నిచ్చారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్, రాజులు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు, తెలిపారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ సంయుక్తంగా విద్యా సంస్థల బంద్ పోస్టరును శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు అని ఎంతో మంది త్యాగాలు చేశారని అన్నారు. నాటి ఉద్యమాల్లో విద్యార్థులు సైతం భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కును తెగనమ్మేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శాఖ ఉక్కును రక్షించుకునేందుకు ఉద్యమంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, శ్రీఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్ జన్మదినం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జన్మదినం సందర్భంగా జగన్నాథపురం సర్పంచ్ జోగి రాములమ్మ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలో ఉన్న సర్పంచ్‌లు రెయ్య రామి రెడ్డి, అంగ లక్ష్మి జనార్ధన్, జీరు బాబురావు, శ్రీరంగం వీరా స్వామి, పరపటి శ్రీనివాస రెడ్డి, బుడ్డ మోహన్ రెడ్డి, జిల్లా మత్స్య కార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, పుక్కళ్ల లక్ష్మణరావు దువ్వాడ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

టెక్కలి రూరల్ : జనసందోహం మధ్యలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అక్కువరం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని కొత్తగా నిర్మాణం చేపట్టిన వైసిపి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మాతృమూర్తి, తమ్ముళ్ల శ్రీధర్, పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ప్రారంభించారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి బారులుతీరారు. జెమ్స్ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ దువ్వాడ శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాలంటీర్ చిత్రం ప్రోమోను ధర్మాన కృష్ణదాస్ ఆవిష్కరణ చేశారు. ఎస్ఐలు రామకృష్ణ, రమేష్‌బాబు, ఎఎస్ఐ రమణ సిబ్బందితో పర్యవేక్షించారు.

సంతబొమ్మాళి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ రాములమ్మ

టెక్కలి రూరల్ : అభినందిస్తున్న నాయకులు

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సహోద్యోగుల ఒక్కరోజు గౌరవ వేతనం చెక్కును విశ్రాంత హోమ్‌గార్డుకు జిల్లా ఎస్‌పి జిఆర్.రాధిక అందజేశారు. జూన్‌నెలలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు కె.త్రినాథరావుకు జిల్లాలో పని చేస్తున్న హోంగార్డులు స్వతహాగా విరాళంగా ఇచ్చిన ఒకరోజు వేతన మొత్తం రూ.4.21 లక్షల నగదు చెక్కు రూపంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ముందుంటుందని, ఎల్లవేళల మీకుతోడుగా ఉంటుందని హామీ ఇస్తూ, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కెవి నర్సింగరావు ఉన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చించుకునేందుకు ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కాంతారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో ఉద్యోగులను క్రమబద్ధీకరించి వైసిపి ప్రభుత్వ ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణమే గ్రాస్ పే అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, మెడికల్ లీవులు, చెల్డ్ కేర్ లీవులు అమలు చేయాలన్నారు. ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సమస్యలపై చర్చినున్నట్టు తెలిపారు. సమావేశానికి ఉద్యోగులంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యా సామగ్రితో విద్యార్థులు

విద్యా సామాగ్రి పంపిణీ

పొందూరు: మండలం లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ పరిధిలో విద్యార్థులకు విద్యాసామగ్రిని శనివారం సంస్థ నేషనల్ డైరెక్టర్ డా.రంజిత్ కుమార్ పాణి పంపిణీ చేశారు. సంస్థ పరిధిలో 292 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, నిర్మలా రాణి, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది ఉగాది, మోహన్, శ్రీను, స్వాతి, మాలతి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

జీడి రైతులకు తీవ్ర అన్యాయం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస: జీడి రైతులకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, పండించిన జీడి పిక్కలను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో నీలావతి గ్రామంలో శనివారం టిడిపి, జనసేన సంయుక్తంగా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టిడిపి జెండాను శిరీష ఆవిష్కరించగా జనసేన జెండాను సంతోష్ పండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, జనసేన దాసరి రాజు, లక్ష్మణ కుమార్, సంతోష్ పండా, దువ్వాడ సంతోష్, కుప్పాయి గోపాల్, మద్య భాస్కరరావు, కిక్కర ఢిల్లీ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గుండెపోటుతో ఆర్మీ జవాను మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బాపూజీ (ఫైల్)

మండలంలో ఉద్దానం గోపీనాథపురం పంచాయతీ ఉద్దానం మెలియపుట్టి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బచ్చల బాపూజీ (29) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు శనివారం తన స్వగృహం వద్ద అకస్మాత్తుగా కుప్పకూలినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు గత ఐదేళ్లుగా ఆర్మీలో సిగ్నల్ డిపార్ట్మెంట్‌లో సిపాయిగా పనిచేస్తున్నాడు. దసరా పండుగకు సెలవుకు వచ్చి అనంత లోకాలకు వెళ్లిపోయాడని తల్లితండ్రులు రాజులమ్మ, మల్లేశ్వరరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహానికి జిల్లా ఎస్‌పి కార్యాలయం నుంచి వచ్చిన పోలీస్ సిబ్బంది అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి- నందిగాం

ప్రభాకరరావు నాయుడు (ఫైల్)

మండలం పెంటఊరుకు చెందిన మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ ప్రభాకరరావు నాయుడు (74) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఈయన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా పనిచేసినప్పుడు రైతులకు ఎనలేని సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఈయన సోదరుడు స్వర్గీయ అట్టాడ జనార్దనరావు టెక్కలి మాజీ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈయన భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందింది.

మృతిచెందిన కృష్ణారావు

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం అక్కవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం రహదారి దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లికి చెందిన కళ్లేపల్లి కృష్ణారావు(58) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జన్మదిన వేడుకలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా, నరసన్నపేట నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఎస్ఐ రామకృష్ణ కారును వెంబడించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణారావు మృతిపట్ల ఎమ్మెల్సీ శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

బైక్ చోరీ

కొత్తూరు : మండలంలో కర్లెమ్మ పంచాయితీ ఆఫీషియల్ కాలనీకి చెందిన పారాపురం విఆర్ఒ వలురౌతు నారాయణరావుకు చెందిన హీరో స్పెండర్ ద్విచక్ర వాహనాన్ని ఇంటిముందు పార్కింగ్ చేయగా దానిని అక్టోబర్ 17 రాత్రి చోరీకి గురైనట్లు పాలిసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి గురైన తరువాత చుట్టుప్రక్కల వెతకగా ఎక్కడ దాని జాడ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా హెచ్‌సి ధర్మారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడవిపిల్లి దాడిలో దూడ మృతి

ప్రజాశక్తి- కంచిలి

ఆవుదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మండలంలో జాడుపూడి ఎంపిటిసి జామి జయకు చెందిన అవుదూడ అడవిపిల్లి దాడిలో మృతి చెందింది. బాధితులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు మేరకు తన పెరట్లో కట్టి ఉంచిన ఆవుదూడపై గుర్తుతెలియని జంతువు దాడిచేసి చంపిందనే సమాచారంతో అటవీశాఖ అధికారులు శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలన చేశారు. ఇటీవల ఉద్దానం ప్రాంతంలో పులి సంచారంపై వస్తున్న భయాందోళన నేపథ్యంలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. గుర్తులు, దాడిచేసిన పద్ధతిని పరిశీలించిన అనంతరం ఇది అడవిపిల్లి దాడిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో అటవీశాఖ అధికారులు రాఘవయ్య, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. సంఘటన స్థలాన్ని ఎంపిపి దేవదాస్ రెడ్డి పరిశీలించారు.

ఆద్య ఆపరేషన్ విజయవంతం

కవిటి : 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' అంటూ హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ప్రగడపుట్టుగకు చెందిన యాండ్రాపు ఆద్య అనే చిన్నారి కోసం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి వేల హృదయాలు స్పందించి పాప ఆపరేషన్ కోసం లక్షల రూపాయలు అందించారు. ఆ వేల హృదయాల దీవెనలతో పాపకు జరిగిన బోన్‌మారో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్ విజయవంతమైందని పాప తల్లిదండ్రులు యాండ్రాపు చిరంజీవి, అంజలి తెలిపారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రిలో నెలరోజులుగా వైద్యుల పర్యవేక్షణలో జరిగిన బిఎంటి ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని, అయితే ఇప్పటి నుంచి మరో రెండు నెలలు చాలా కీలకమని వైద్యులు తెలిపినట్టు చిరంజీవి చెప్పాడు. పాపకు ఎటువంటి ఇన్‌ఫెక్షన్ రాకుండా నిరంతరం తమకు అందుబాటులో ఉండాలని వైద్యులు చెప్పారని పాప తండ్రి తెలిపాడు. దీని కోసం ఆస్పత్రికి దగ్గరలో గదిని అద్దెకు తీసుకుని ఉన్నట్టు తెలిపారు.

పోటీతత్వం అవసరం

కవిటి: విద్యార్థులకు చదువులో పోటీతత్వం ఉండాలని ఎంఇఒ మజ్జి ధనుంజయ అన్నారు. కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాలలో పి. దుర్వాసులు మాస్టారు స్మారకార్థం శనివారం సాయంత్రం క్విజ్, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కోదండరావు సహకారంతో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు ఎంఇఒ బహుమతులు అందజేశారు. అగ్నికుల క్షత్రియ నాయుడు, పొల్లాయి లక్ష్మణమూర్తి, హెచ్ఎం బి.వరలక్ష్మి, ప్రసాద్ పట్నాయక్, టి. రవి, వై.బాలరాజు, జి.మెర్సిరెస్మా పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం వంటిదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శనివారం బంటుపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించి తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మార్చడమే సిఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెద్దరామనాయుడు, వైసిపి నాయకులు పాతిన ముకుందరావు, ఎంపిడిఒ రమణమూర్తి, మండల ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు సుమన్, వైసిపి నాయకులు, సర్పంచ్ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం సిపిఒ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి వై.వెంకటప్పడు భార్య లల్ల కోటేశ్వరికి శనివారం కారుణ్య నియామక ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేశారు. కుటుంబానికి ఆర్థిక భద్రత దృష్ట్యా ఈనియామకాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, అసోసియేషన్ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆమెకు పొందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేటరు నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి కె. వెంకటేశ్వరరావు, ఉప సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బి.వి. నర్సింగరావు, అసోసియేషన్ ప్రతినిధులు బడగల పూర్ణచంద్రరావు, అట్ల సూర్యప్రకాష్, షేక్ బాషా, క్లాస్-4 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చింతల ఉమా శంకర్, మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మణి

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఆమదాలవలస: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో శిశు సంరక్షణ, బాలల హక్కులపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తే బాలలు ఆరోగ్యంగా ఉంటారని, చదువుపై శ్రద్ధ చూపెడతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాయని వాటిని సక్రమంగా బాలలకు అందించాల్సిన బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కణితి విజయలక్ష్మి భాయ్, న్యాయవాదులు సీపాన గోవిందరావు, పాతిన వరహానరసింహం, బొడ్డేపల్లి మోహనరావు, కింతలి త్రినాథరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నందిగాం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నూరుల్ కమర్

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో నందిగాంలో 3, బెజ్జిపల్లిలో1, సవరలింగుపురంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. ఓట్లు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరికీ ఓట్లు నమోదు చేయాలని సూచించారు. ఈయనతో పాటు తహశీల్దార్ వై.వి.పద్మావతి ఉన్నారు.

రణస్థలం : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ అన్నారు. శనివారం రణస్థలం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా నంబర్లు వేయించాలన్నారు. 18 సంవత్సరాలు నిండే యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఓటును పరిశీలన చేసుకోవాలని, జాబితా పరిశీలన తదుపరి ఏమైనా తప్పులుంటే నిర్ణీత ఫారాల్లో సవరణలు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకునే విధంగా ఓటర్లుకు అవగాహన కల్పించాలని బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. చనిపోయిన ఓటరు వివరాలు సేకరించి విచారణ చేసి నోటీసులు జారీ చేసిన తదుపరి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిటి శ్రీనివాసరావు, పలు పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే స్వీకరించాలని తహశీల్దార్ బి.అప్పలస్వామి సూచించారు. శనివారం వజ్రపుకొత్తూరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఈ నెల 4, 5 తేదీల్లో బిఎల్‌ఒలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరునికి ఓటుహక్కు కల్పించడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఈయనతో పాటు డిటి వాయిలపల్లి గిరిరాజ్, కార్యదర్శి యాదవరాజు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు ఉన్నారు.

రణస్థలం : ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు

మంత్రి సీదిరికి జర్నలిస్టుల సన్మానం

పలాస: రాష్ట్రమంత్రి వర్గ సమావేశంలో జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు క్యాబినెట్‌లో మంత్రివర్గం అంగీకరించడం పట్ల ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి డి.మహారణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాస, కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా మహారణ మాట్లాడుతూ ప్రభుత్వం సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకుందని, దీనివలన జిల్లాలో గల అనేక మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరవుతాయన్నారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అనేక మంది విధులు నిర్వహిస్తున్నా కొంతమందికే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడేషన్లు పొంది ఉన్నారని, మిగిలిన జర్నలిస్టులకు అక్రిడేషన్లు లేకపోయినా అనేక పత్రికల్లో విలేకరులుగా పని చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వారికి కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జగదీష్, రమణ, నారాయణ, రాము, హరి, భాస్కరరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నేతాజీ, రవి, కొంచాడ రవి, జయంత్, మోహన్, మేఘన, కింజరాపు కృష్ణ, శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహానికి జర్నలిస్టులు పాలాభిషేకం

ప్రజాశక్తి- నరసన్నపేట

రాష్ట్రంలో అక్రిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం పట్ల నరసన్నపేట జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నరసన్నపేట వైఎస్ఆర్ జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి, నరసన్నపేట నియోజకవర్గ యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఎపిపిఎస్‌సి పరీక్షలపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు తమ లక్ష్య సాధనకోసం నిరంతరం తపన పడాలని, ఇష్టంగా చదివితే ఉన్నత శిఖరాలను అందుకోగలరని సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరక్టర్ బాల లత సూచించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎపిపిఎస్‌సి, యుపిపిఎస్‌సి పరీక్షల పట్ల అవగహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సులో ఆమె హాజరై పరీక్షల నిర్వహణపై ఈ సదస్సులో మహిళా కళాశాల ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ మెంటారు నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టెక్కం రాంగోపాల్, అధ్యాపకులు హాజరయ్యారు.

అవగహన కల్పిస్తున్న బాల లత

అరాచక పాలనకు అంతం తప్పదు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలన అంతంకాక తప్పదని ఎమ్మెల్యే అశోక్ ధ్యజమెత్తారు. శనివారం మండలంలో తీరప్రాంత గ్రామం డోంకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రసంగించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక శక్తుల అగాడాలు అంతు లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అంతం తప్పదని జోస్యం చెప్పారు. ముందుగా గ్రామంలో పర్యటించి వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి పెరిగిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, సదనందా రౌలూ, సహదేవ రెడ్డీ, లోపింటి పద్మనాభం, లోకనాథం, పరుశురాం, కామేశ్వరరావు, ప్రకాష్‌నాయక్, నందిక జాని, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మందస: మండలం అంబుగాం పంచాయతీ పరిధిలో టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన నేతృత్వంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా, రైతులు రాజుల్లా బతకాలన్నా మళ్లీ చంద్రబాబు సీఎం అవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, చౌదరి మురళి, లచ్చయ్య, సిర్ల కృష్ణారావు, ముడుముంచి నవీన్ కుమార్, బత్తని తారకశ్వరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

మందస మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలం అంబుగాం, చిన్న లింబుగాం గ్రామాల్లో బాబు ష్యూరిటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి చౌదరి మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు మండల లచ్చయ్య, జిల్లా బిసిసెల్ కార్యదర్శి సిర్ల కృష్ణారావు, తెలుగుయువత అధ్యక్షుడు ముడుముంచి నవీన్ కుమార్, బూత్ లెవల్ ఏజెంట్‌లు హరికృష్ణ, మండల మాధవరావు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు జగన్నాయకులు

ప్రజాశక్తి- పలాస

దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు 6వ వర్థంతిని పునస్కరించుకొని మండలంలో హరిపురం, బేతాళపురం, నారాయణపురం, బిడిమి వద్ద జగన్నాయకులు శిలా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సతీమని జుత్తు ధనలక్ష్మి సోదరుడు జుట్టు నీలకంఠ చైతన్య, రైతాంగ సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు నివాళ్లర్పించారు. హరిపురంలో జగన్నాయకులు విగ్రహానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరిఅప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పలాస నియోజకవర్గం నాయకులు శాసనసభ లో తన బాని వినిపించి ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల హదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ దాన యాదవ్, వైసిపి మండల అధ్యక్షుడు అగొన్న సూర్యారావు, సర్పంచ్ పురుషోత్తం, ఎంపిటిసి అప్పన్న, వైసిపి నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల బిజెపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 9:30 గంటలకు జిల్లాపార్టీ అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఇఆర్) అధ్యక్షతన ఎచ్చెర్ల బిజెపి క్యాంప్ కార్యాలయంలో జరుగుతుందని పార్టీ కార్యదర్శి మన్నె సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాలుగు మండలాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

స్పందన కార్యక్రమంలో పాల్గొన్న భవానీశంకర్

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక స్పందన కార్యక్రమం మండల ప్రత్యేకాధికారి భవాని శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు నాలుగు వినతులు అందాయి. వచ్చిన ఫిర్యాదులకు తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎస్ఐ రాజేష్, ఎంఇఒ దేవేంద్రరావు, మండల పరిషత్ ఎఒ తిరుపతి పట్నాయక్, ఎస్.కృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ప్రజలు, పాలక మండలి సభ్యుల సమక్షంలో హుండీలను తెరిచారు. 61 రోజుల పాటు యాత్రికుల నుంచి కానుకలు, నగదు రూపంలో వచ్చిన ఆదాయం రూ.47,62,810 సమకూరింది. వాటిలో నోట్లు రూపంలో రూ. 46,18,290, చిల్లర నాణేలు రూపంలో రూ.1,44,520 సమకూరింది. వీటితో పాటు బంగారం 26 .500 గ్రాములు, వెండి 2 .200 కేజీలు, విదేశీ మారక ద్రవ్యం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 1డాలర్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ 10 పౌండ్స్ వచ్చాయని ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సూపరింటెండెంట్ బిఆర్‌వివి ప్రసాద్ పట్నాయక్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనురాధ, జివిబి ఎస్. రవికుమార్, కృష్ణమాచార్యులు హాజరయ్యారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పత్తి పంటలో పురుగు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు సాదించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ డా. యస్. కిరణ్ కుమార్, రణస్థలం ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు అన్నారు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం రణస్థలం, లావేరు మండలాల ఆర్‌బికె ఇన్‌ఛార్జులకు మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెట్టకి తట్టుకోవడానికి మల్టీ కె (13-0-45) కేజీ ఒక ఎకరానికి వాడాలని చెప్పారు. రబీ పత్తి, మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు, ఎరువులు, చీడపీడల, కత్తెర పురుగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి వై.సూర్యకుమారి, ఎఒలు డి.విజయ భాస్కరరావు, డి.మహేష్ నాయుడు, లేబ్ ఎఒ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

కడుమలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో కడుమ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వలురౌతు షణ్ముఖరావుకు చెందిన పంట పొలంలో నవరదేసి రకం వరి పంటను పంట పంటకోత ప్రయోగం నిర్వహించగా 8.250 దిగుబడి వచ్చిందన్నారు. దీని ప్రకారం ఎకరాకు 16 బస్తాలు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. పంటలో ఎటువంటి రసాయనిక పురుగు మందులు వాడలేదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.జనార్ధన, కేశవ, సంజీవరావు, కృష్ణవేణి వున్నారు.

కొత్తూరు : పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

మానసిక వికలాంగుల ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మానసిక వికలాంగుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనో వికాస కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శీతాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని, అందువల్ల వికలాంగులైన వారిపై తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అంకిత భావం, సేవా దృక్పథంతో కేంద్రంలో సిబ్బంది సేవలందించాలని సూచించారు. వృత్తి విద్య నేర్పించాలని, తరుచుగా ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాలను కేంద్ర నిర్వాహకులు బి.విజయకుమార్, శేఖర్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అంతకుముందు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. అనంతరం వారికి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేశ్వరరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది, బ్రెడ్స్, వైసిబి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

పులి జాడలపై సమాచారం అందించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గత కొద్ది రోజులుగా పెద్దపులి జాడ తెలియక రకరకాల పుకార్లుతో ప్రజలు భయాందోళనకు గురువుతున్నారని అధికార యంత్రాంగం సమగ్ర సమాచారం ఇచ్చి పులి బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఉద్దానంలో బతకడానికే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో 10 రోజులుగా పెద్దపులి రూపంలో మరో సమస్య మనల్ని చుట్టు ముట్టేసిందన్నారు. గత పది రోజులుగా పెద్దపులి సంచారం ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఎన్నో మూగజీవాలు ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం ఇన్ని రోజులుగా సమస్యను గుర్తించి సమాచారం అందివ్వడం తప్పా పరిష్కారపు జాడలు ఎక్కడా లేవన్నారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుని ప్రాణనష్టం జరగకుండా ఫారెస్ట్ అధికారులను, ఆధునిక యంత్రాంగాలను ఉపయోగించి పులి, పులుల జాడని కనిపెట్టి ఉద్ధానం సమస్యను పరిష్కరించాలని జనసేనపార్టీ తరపున కోరారు.

కొనసాగుతున్న ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలపై శుక్రవారం అర్ధరాత్రి వరకు తనిఖీలు నిర్వహించగా రెండోరోజు శనివారం శ్రీకాకుళం ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎసిబి సిఐలు కె.భాస్కరరావు, హరి, ఎస్‌వి రమణతో పాటు 10 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి కొంతమంది ఎసిబి అధికారులు కార్యాలయంలో రికార్డులు పరిశీలించగా మరికొంత మంది భవననిర్మాణ పనులను పరిశీలించారు. కార్యాలయం లోపలికి బయటవ్యక్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమక్షంలో ఆన్‌లైన్ రికార్డులు పరిశీలించారు. మొదటిరోజు ఐదు భవనాల రికార్డులు పరిశీలించగా, రెండోరోజు 11 భవన నిర్మాణ పనులకు సంబంధించి రికార్డులు, భవనాలు పరిశీలించినట్లు తెలుస్తోంది.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో తనిఖీలు చేపడుతున్న ఎసిబి అధికారులు

మాట్లాడుతున్న మండల ఎఒ మోహనరావు

ఆరుతడి పంటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రబీ సీజన్లో ఆరుతడి పంటలను వేసుకోవాలని వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కొరపాం రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలసి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్నారు. కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలులో రవాణా కోసం ఉపయోగించే వాహనాలకు జిపిఎస్ కోసం ముందుగానే రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 7వ తేదీన రెండోవిడత రైతుభరోసా నిధులు సిఎం జగన్మోహన్ రెడ్డి విడుదల చేస్తారని తెలిపారు. రబీ సీజన్లో ఆరుతడి పంటలైన పెసర, మినుము, నువ్వులు, రాగులు వంటి పంటలను పండించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలోఎస్.రాజశేఖర్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

చిన్నగురు స్వామికి ప్రశంసలు

ఇచ్ఛాపురం: సింహాచలం పుణ్యక్షేత్రంలో అలరించిన భక్తి రంజని ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సింహాచలం పుణ్యక్షేత్రంలో స్వామి వారి ఎదురుగా ఇచ్ఛాపురం శ్రీవెంకటేశ్వర భక్తి రంజని కళాబందం సభ్యులు ఆలా పనకు ప్రశంసలు అందుకున్నారు. చిన్న గురుస్వామి, నీలాపు మనీషా, కీబోర్డ్ హేమంత్ కుమార్ బాడిత్య తబలాపై నిత్యానంద్ బాడిత్య తమదైన శైలిలో చక్కటి అన్నమయ్య కీర్తనలు, భక్త రామదాసు కీర్తనలు, లక్ష్మీ నరసింహ స్వామి కీర్తనలు, ఘంటసాల పాడిన భగవద్గీత చక్కగా ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కళాకారులకు సింహాచలం దేవస్థానం ట్రస్టు, ఆలయ అర్చకులు, కార్యక్రమం కో-ఆర్డినేటర్ మారుతీరావు కళాకారులకు సత్కరించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వర్షభావ పరిస్థితులు కారణంగా ఎండిపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పలాస వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.వి మధు అన్నారు. శనివారం మండలంలో గోవిందపురం, పొల్లాడ, కోమరల్తాడ, దేవునల్తాడ, ఎస్‌జె పురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. సుమారు 500 ఎకరాలకు పైబడి పంట పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. పొట్ట దశలో పంటలు ఎండిపోయిన తమకు న్యాయం చేయాలని రైతులు ఆయన వద్ద తమ గోడు వినిపించారు. రైతులకు ప్రభుత్వం తరపున సహాయం అందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎఒ కిరణ్ వాణీ, ఎఇఒ జ్యోత్స్న, ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు కుసుమకుమారి, శివ, పవన్, సంతోష్, సర్పంచ్ అట్టాడ గోపి, రైతులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రయివేటు వాహనాలే దిక్కు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గ మండలాల్లో మారుమూల గ్రామాలకు ఇప్పటికీ ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. గతంలో రహదారులు బాగోలేనప్పటికీ ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం గ్రామాలకు కూడా చక్కని రహదారులున్నాయి. ప్రయాణాలకు ఎలాంటి ఆటంకం లేకపోయినా బస్సులు పల్లెలకు వెళ్ళకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని తిరుగుతున్న ప్రైవేటు వాహనాలను రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్‌టిసిబస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. త్వరగా గమ్యం చేరాలన్న ఉద్దేశ్యంతో ప్రయాణికులు అధికచార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు. కిక్కిరిసిన వాహనాల్లో ప్రయాణించడం వలన కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. టెక్కలి ఆర్‌టిసి డిపో మెనేజర్‌కు కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తమ గ్రామాలకు రోడ్డు బాగా ఉన్నప్పటికీ బస్సులు రాకపోవడంతో టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం కళాశాలలకు, వివిధ పనులు కోసం వెళ్లే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పినప్పుడు వారు రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని, కొన్ని గ్రామాలకు నడిపే సర్వీసులకు ఆదాయం తక్కువగా ఉండటంతో గతంలో నిలుపుదల చేశామని, పరిశీలించి బస్సులు నడుపుతామని సమాధానం చెప్పి వెళ్ళిపోతున్నారు తప్పా ఇప్పటివరకు బస్సులుమాత్రం వేయటం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పల్లెలకు ఆర్‌టిసి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

దంత రోడ్డులో ఆటోపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు

మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

వేతన బిల్లులు సమర్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గౌరవ వేతనాల బిల్లులు సకాలంలో సమర్పించాలని డిఆర్ఒ గణపతిరావు అన్నారు. ప్రభుత్వానికి జిల్లాలో వ్యతిరేకంగా నమోదైన కేసుల్లో పారా వైస్ రిమార్కులు ఇవ్వడంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు సకాలంలో స్పందించాలని కోరారు. గవర్నమెంట్ ప్లీడర్లు, ఎజిపిలతో శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్లీడర్లకు, జిపికు గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులను సకాలంలో సమర్పించాలన్నారు. కోర్టు కేసుల్లో ఎలాంటి డీవియేషన్లు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులపై ఉన్న కేసులపై సమర్థవంతంగా వాదనలు వినిపించాలన్నారు. సమావేశంలో జిపి వినయ భూషణ్, ఎజిపి గొండు సత్యం, జిల్లాలోని పలు కోర్టుల ప్రభుత్వ న్యాయవాదులు హాజరయ్యారు.

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి

ఆమదాలవలస: సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి ఎంతో ఆనందం కలుగుతుందని కృతిక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి చిన్ను అన్నారు. శనివారం శ్రీకాకుళం పట్టణానికి చెందిన సీపాన కేదారి జన్మదినం సందర్భంగా కృతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు, వృద్ధులకు, వికలాంగులకు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా చిన్ను మాట్లాడుతూ భవిష్యత్తులో పెద్దఎత్తున సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోఅశోక్, గురుగుబెల్లి ఈశ్వర్, పవన్, తేజ, సాయి, రాజేష్ పాల్గొన్నారు.